# మహనీయుల విగ్రహాలను అపహాస్యం చేస్తరా?

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, ఏప్రిల్ 5: 'ఏళ్ల తరబడి అధికారంలో ఉన్న కాంగ్రెస్ మహనీయుల చరిత్రను ప్రజలకు తెలియకుండా తొక్కిపెట్టింది. మంథనిలోనూ మేం ఏర్పాటు చేయించిన విగ్రహాలను తాకవద్దని వారి పార్టీ నాయకులకు ఆదేశాలు ఇస్తూ అపహాస్యం చేస్తున్నది' అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధ్వజమెత్తారు. మంథనిలో శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. దళితుల ఆకలి తీర్చిన గొప్ప వ్యక్తి జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. 2014లో తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే సమాజం కోసం పోరాటం చేసిన బాబూ జగ్జీవన్ రామ్, పీవీ నర్సింహారావుతో పాటు ఎంతో మంది మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేశానని గుర్తు చేశారు. ఇక్కడి ప్రజల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా ఉన్న వ్యక్తి కేవలం ఎన్నికల టైంలో మాత్రమే మహనీయుల విగ్రహాలను వాడుకున్నారని, ఎన్నికలు వస్తే ఒకలాగ.. ఎన్నికల అయిపోయిన తర్వాత మరోలా ఉంటున్నారన్నారని ఎద్దేవా చేశారు. తనను ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. ప్రతి ఏడాది నిర్వహించినట్టుగానే ఈ నెల 11 నుంచి 15 వరకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి మహనీయుల దీక్షను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు ఎగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, ఎక్కటి ఆనంతరెడ్డి, వెల్పుల గట్టయ్య, మంథని లక్ష్మణ్, ఆరెపల్లి కుమార్, ఆకుల రాజబాబు, గొబ్బూరి వంశీ, ఎరుకల రవి, నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఓదెల, ఏప్రిల్ 5: ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ ప్లీనరీ బహిరంగ సభకు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఓదెలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండలాధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో జరుగుతున్న సభకు ఓదెల మండలం నుంచి అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పనులను ప్రజలకు వివరించాలని, కార్యకర్తలు బీఆర్ఎస్ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ గంట రాములుయాదవ్, యూత్ మండలాధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్‌గౌడ్, నాయకులు గట్టు శ్రీనివాస్, ఆరెల్లి మొండయ్యగౌడ్, మద్దెల శ్రీనివాస్, రౌతు జలపతి, పత్తి సమ్మిరెడ్డి, గొర్ల కుమార్, నోముల ఇంద్రారెడ్డి, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.





























## 1.75 లక్షల మందికి మొండి చెయ్యి



పీఎం కిసాన్ సమ్మాన్ సాయానికి సంబంధించిన అర్హత నిబంధనల్లో ఫిబ్రవరి 1, 2019 కటాఫ్ డేట్‌పై తీవ్రమైన నిరసన వ్యక్తమవుతున్నది. 2025 సంవత్సరం నడుస్తున్న తరుణంలో ఇంకా 2019 ఫిబ్రవరి 1వ తేదీని అర్హత తేదీగా గుర్తించడం ఏంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరేండ్ల కాలంలో అనేక మంది పట్టాదారులు పెరిగారని, వారికి పథకం వర్తించపోవడం బాధాకరమంటున్నారు. ఈ ఏడాది యాసంగి సీజన్‌లో అర్హులైన రైతు బంధు లబ్ధిదారులు 2,39,818 మంది కాగా, ఈ సంఖ్యతో పోల్చితే పీఎం కిసాన్ సమ్మాన్ పథకంలో లబ్ధిదారుల సంఖ్య మూడో వంతు కూడా లేకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 1.75 లక్షల మంది రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు రావడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కటాఫ్ డేట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

# 'కిసాన్ సమ్మాన్'లో ఏటా కోతే..




- ఆరేండ్ల నుంచి తగ్గుతున్న రైతుల సంఖ్య
- 2019 ఫిబ్రవరి కటాఫ్ డేట్ మార్చని సర్కార్
- వేలాది మంది అర్హులైనా అందని సాయం
- ఒక్క జగిత్యాల జిల్లాలోనే 71వేల మంది తొలగింపు
- నిబంధనలు సడలించాలంటున్న రైతులు

జగిత్యాల, ఏప్రిల్ 5(నమస్తే తెలంగాణ): తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలోని రైతులకు పంట సాయంగా రైతుబంధు పేరిట ఎకరానికి రూ.5 వేల సాయాన్ని ప్రకటించి రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. రైతు సంక్షేమం, పెట్టుబడి సాయం కోసం అమలు చేసిన రైతుబంధుపై ఐక్య రాజ్య సమితి సైతం ప్రశంసలు కురిపించింది. ఈ నేపథ్యంలో పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుగా ప్రధాని మోదీ సర్కార్ సైతం దేశ వ్యాప్తంగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఐదెకరాలలోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఏటా పంట సాయంగా రూ.6వేలు అందిస్తామని, అది కూడా మూడు విడుతల్లో అందజేస్తామని ప్రకటించింది. 2018 డిసెంబర్ నుంచి అమల్లోకి తెచ్చింది. కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద జగిత్యాల జిల్లాలో 2018 డిసెంబర్‌లో తొలి క్వార్టర్‌లో 1,44,545 మంది రైతులకు రూ.28.91 కోట్ల పంట సాయాన్ని అందించారు. ప్రతి ఏడాది ఏప్రిల్, ఆగస్టు, డిసెంబర్ నెలల్లో మూడు దఫాలుగా ఈ పంట సాయాన్ని రైతుల ఖాతాల్లో నేరుగా జమచేస్తూ వస్తున్నారు. అయితే 19 క్వార్టర్లకు సంబంధించిన ప్రభుత్వం అందించిన పంట సాయాన్ని పరిశీలిస్తే ఆశ్చర్యం కలుగుతోంది. 2018 డిసెంబర్‌లో 1,44,545 మందికి పంట సాయంగా ఇచ్చిన ప్రభుత్వం 2019 ఏప్రిల్‌లో ఆ సంఖ్యను తగ్గించి వేసింది. కేవలం 1,43,166 మందికి మాత్రమే సాయం అందజేసింది. తర్వాత క్రమంగా లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోతూనే వచ్చింది. చివరకు గతేడాది డిసెంబర్ మాసంలో 19వ క్వార్టర్‌లో కేవలం 71,140 మంది రైతులకు మాత్రమే పంటసాయం అందజేశారు. ఆ ఆరేండ్ల వ్యవధిలో 73,405 మంది రైతులను ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పరిధి నుంచి తొలగించివేశారు. మొదటి క్వార్టర్‌లో రూ.28.91 కోట్ల పంటసాయం ఇచ్చిన కేంద్ర సర్కార్, 19వ క్వార్టర్ నాటికి కేవలం రూ.14.23 కోట్లు మాత్రమే సాయంగా ఇవ్వడం గమనార్హం.

## ఆరేండ్లయినా అర్హుడు కాలే

.. శ్రీనివాస్‌ది కొడిమ్యాల మండలం సూరంపేట. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఇతడు డిగ్రీ పూర్తి చేసినా, ఉద్యోగం రాకపోవడంతో వ్యవసాయంలోకి దిగాడు. రైతు, వ్యవసాయం ప్రాముఖ్యత అర్థం చేసుకున్న అతడికి వృత్తిపై అభిమానం పెరిగిపోయింది. 2018 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పథకాన్ని ప్రారంభించి, ఐదెకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులకు ఏడాదిలో మూడు దఫాల్లో రూ.6 వేల పంట సాయం అందజేస్తున్నది. అయితే, సహజంగానే జాతీయభావాలు ఉన్న శ్రీనివాస్ బీజేపీకి గట్టి మద్దతుదారుడిగా మారిపోయాడు. 2019లో జరిగిన ఎన్నికల కోసం తన గ్రామంలో ఆ పార్టీ కోసం గట్టిగా పనిచేశాడు. రైతులందరినీ పోగేసి కిసాన్ సమ్మాన్ పథకాన్ని వివరించాడు. ఎన్నికలు ముగిసిపోయాయి. ఈ క్రమంలోనే 2019 జూన్‌లో శ్రీనివాస్‌కు వివాహం జరగగా, అతడి తండ్రి ఆయనకున్న నాలుగెకరాల్లో నుంచి రెండెకరాలు కొడుక్కు పట్టా చేశాడు. అనంతరం శ్రీనివాస్ మండల వ్యవసాయాధికారిని కలిసి తన పేరును రెండెకరాల భూమి ఉందని, కిసాన్ సమ్మాన్ పథకం మంజూరు చేయాలని దరఖాస్తు సమర్పించాడు. 2019 ఫిబ్రవరి 1వ తేదీ కంటే ముందు పట్టాదారులుగా ఉన్న వారికి మాత్రమే పథకం వర్తిస్తుందని, తర్వాత పట్టా అయిన వారికి రాదని, ప్రభుత్వం నిబంధనలు మార్చితే చెబుతానని ఏవో చెప్పడంతో కొంత నిరాశ చెందాడు. అయితే, ఇది జరిగి ఆరేండ్లు గడుస్తున్నా నిబంధనల్లో మార్పు రాకపోవడంతో శ్రీనివాస్ ఇప్పటి వరకు లబ్ధిదారుడిగా ఎంపిక కాలేదు. పెండ్లి అయిన కొత్తలో దరఖాస్తు చేసుకోగా, ఇప్పుడు ఇద్దరు పిల్లల తండ్రి అయినా పథకం రాకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. అదే సమయంలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకం 2019 ఖరీఫ్ నుంచే వస్తుండడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశాడు. పథకాలు ప్రవేశపెడితే అర్హులైన వారికి లబ్ధి చేకూర్చాలి కాని, ఏండ్ల కొద్ది నిబంధనల పేరిట అర్హులకు నష్టం జరిగేలా ఉండవద్దని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశాడు.

### మోదీ పైసల్ ఒక్కసారి కూడా రాలే



మోదీ పైసల్ ఒక్కసారి కూడా నాకు రాలేదు. పీఎం కిసాన్ సమ్మాన్ అని చెప్పుడు, వినుడే గానీ, నాకు మాత్రం వస్తలేవు. నాకు మూడెకరాల భూమి ఉన్నది. 2018 కంటే ముందు కొంచెం పట్టా భూమి ఉండేది. అప్పుడు దరఖాస్తు చేసుకున్నా పైసల్ రాలేదు. ఎందుకు రాలేదు సార్.. అని అడిగితే తెలువదన్నరు. తదుపరి 2019లో ఇంకొంచెం భూమి కొనుగోలు చేసినా. ఈ రెండు పత్రాలు సార్ల వద్దకు తీసుకుపోయి అందజేసినా లాభం లేదు. వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లి, పాత పాసుబుక్, కొత్తగా కొనుగోలు చేసిన పాస్‌బుక్కుల వివరాలను ఆన్‌లైన్‌లో చేయించినా ఫలితం లేదు. తిరిగి తిరిగి యాష్టకచ్చింది. తిరుగుడు బంద్ చేసినా. రైతు బంధు మాత్రం ఎప్పుడు ఇబ్బంది కాలేదు. కరెక్ట్ టైమ్‌కు పడింది. పథకం ప్రవేశపెట్టడంతో పాటు, దాన్ని సక్కగా అమలు చేయాలి. లేకుంటే వదిలేయాలి. ఇట్లా మా రైతులను గోసపెట్టద్దు.

- ముత్యాల శంకర్, మల్లాపూర్

### సవాలక్ష నిబంధనలు.. రైతుల్లో తీవ్ర నిరాశ

జగిత్యాల జిల్లాలో పీఎం కిసాన్ సమ్మాన్ సాయం విషయంలో పెద్ద సంఖ్యలో రైతులు నిరాశకు లోనవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకానికి అర్హత సాధించి లబ్ధిని పొందడానికి సవాలక్ష కొర్రీలను ప్రభుత్వం పెట్టడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 2018లో రైతు బంధు పథకం కింద 1,76,929 మంది రైతులకు రూ.310.97 కోట్ల సాయాన్ని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం చేస్తే, అదే సంవత్సరం పీఎం కిసాన్ సమ్మాన్ పథకాన్ని ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం 1,44,545 మంది రైతులకు మాత్రమే పథకాన్ని వర్తింపజేసింది. 32,384 మంది రైతులను వివిధ కారణాలు చూపుతూ పథకానికి ఎంపిక చేయలేదు. తర్వాత కేంద్ర ప్రభుత్వం పథకంలో లబ్ధిదారులుగా ఎంపిక కావడానికి 2019 ఫిబ్రవరి 1వ తేదీని కటాఫ్ డేట్‌గా ప్రకటించింది. ఆ తేదీ కంటే ముందు పట్టాదారుడిగా ఉన్న వారిని మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ ప్రకటన తర్వాత నుంచి కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ పథకంలోని లబ్ధిదారుల సంఖ్యను అనేక కారణాలను చూపుతూ తగ్గించి వేస్తూనే వస్తోంది. రైతులు ఆధార్‌కార్డును బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేసుకోకపోతే ప్రధానమంత్రి సమ్మాన్ నిధి ఇవ్వడం లేదు. ఆదాయ పన్నును చెల్లించే వారికి, ఆదాయ పన్ను రిటర్న్స్ దాఖలు చేసే రైతులకు పథకాన్ని వర్తింపజేయడం లేదు. అలాగే కొత్తగా పట్టదారు పాసు పుస్తకాలు పొందే రైతులకు పథకాన్ని వర్తింపజేయడం లేదు. రేషన్‌కార్డులో ఒక్కరికి మాత్రమే కిసాన్ సమ్మాన్ నిధిని ఇస్తున్నారు. ఉమ్మడి కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు లేదా భార్య, భర్తలకు వేర్వేరుగా భూమి ఉన్నా వారిని పరిగణలోకి తీసుకోవడం లేదు.

### కటాఫ్ డేట్ తొలగించాలి



కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి పెట్టిన కటాఫ్ తేదీని వెంటనే ఎత్తివేయాలి. ఈ నిబంధనల వల్ల చాలా ఇబ్బందవుతున్నది. ఈ నిబంధన ఎత్తివేస్తే నాలాంటి చాలామంది రైతులకు పీఎం కిసాన్ పథకం అందే అవకాశం ఉన్నది. 2019కి కేంద్ర ప్రభుత్వం కటాఫ్ పెడితే అప్పటి నుంచి నేటి వరకు చాలామంది రైతులు వ్యవసాయ భూములు కొనుగోలు చేశారు, విక్రయించారు. వారిని పరిగణలోకి తీసుకోకపోవడం సరికాదు. ఐదేండ్లు అవుతున్నా ఇంత వరకు నాకు కేంద్ర ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం కింద ఒక్క పైసా అందలేదు.

- బైరి శేఖర్, రాఘవపేట, రైతు, మల్లాపూర్ మండలం

# బంగారం తెచ్చినోళ్లే కొట్టేసిన్రు

- సౌదీ నుంచి ఇండియాకు 400 గ్రాముల బంగారం
- తీసుకొచ్చిన వ్యక్తులే కాజేసేందుకు పన్నాగం
- ఇవ్వాల్సిన వ్యక్తికి కాకుండా మరొకరికి అందజేత
- ఇద్దరు అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

వేములవాడ, ఏప్రిల్ 5: ఇండియాలో ఉన్న వ్యక్తి తన అవసరాల నిమిత్తం సౌదీ నుంచి తెప్పించుకున్న బంగారాన్ని తీసుకొచ్చిన వ్యక్తులే కొట్టేసిన వ్యవహారంలో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి తెలిపారు. శనివారం వేములవాడ ఠాణాలో వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్‌కు చెందిన రుద్ర రాంప్రసాద్ తన అవసరాల నిమిత్తం సౌదీ నుంచి గోల్డ్ తెప్పించుకోవాలని భావించాడు. సౌదీలో ఉన్న తన సమీప బంధువు రవీందర్‌ను సంప్రదించాడు. 400 గ్రాముల గోల్డ్ పంపించాలంటూ అందుకు అయ్యే డబ్బులు రూ.35లక్షలు ఇక్కడి నుంచే పంపించాడు. ఈ క్రమంలో రవీందర్ సౌదీలో తనతో పనిచేసే వేములవాడకు చెందిన కాలువ వెంకటేశ్‌ను కలిసి విషయం చెప్పాడు. చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన తొంటి బీరయ్య, గడ్డం అనిల్ ఇండియాకు వెళ్తున్నారని, వారితో పంపిద్దాం అని చెప్పి వెంకటేశ్ మధ్యవర్తిత్వం చేసి, రవీందర్ ద్వారా 400 గ్రాముల బంగారం బిస్కెట్లను వారికి అప్పగించాడు. అయితే ఆ బంగారాన్ని కొట్టేసేందుకు వెంకటేశ్, బీరయ్య, అనిల్ స్కెచ్ వేశారు. విషయాన్ని ఇండియాలో ఉన్న వారి సమీప బంధువు ఏనుగుల నాగరాజుకు చెప్పారు. అనుకున్నట్లుగానే బీరయ్య, అనిల్ ఎయిర్‌పోర్టులో దిగగానే అప్పటికే అక్కడ ఉన్న నాగరాజుకు గోల్డ్ ఇచ్చి పంపించగా, అతను ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి కనిపించకుండా పోయాడు. అయితే తనకు ఇవ్వాల్సిన గోల్డ్‌ను మరొకరికి ఇచ్చారని రాంప్రసాద్ పోలీసుకుల ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు ప్రారంభించారు. బీరయ్య, అనిల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు చెప్పారు. ఇందులో మొదటి నిందితుడు కాలువ వెంకటేశ్ సౌదీలో ఉండగా, నాలుగో నిందితుడు నాగరాజు ప్రస్తుతం కనిపించకుండా పోవడంతో పోలీసులు గాలిస్తున్నట్లు వివరించారు. విమానాశ్రయం నుంచి కస్టమ్స్ అధికారుల కన్నుకప్పి పెద్ద మొత్తంలో బంగారం తీసుకువచ్చిన వీరి వెనుక ఏదైనా ముఠా హస్తం ఉన్నదా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఆమె వెంట పట్టణ సీఐ వీరప్రసాద్, సిబ్బంది ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి, పక్కన సీఐ వీరప్రసాద్

# డోర్లు, కిటికీలు ఊడదీసి.. ఇంటికి తీసుకెళ్లి

శ్మశానవాటిక బిల్లులు రాలేదని ఓ మాజీ సర్పంచ్ నిరసన



మాజీ సర్పంచ్ ఇంటి వద్ద ఉన్న శ్మశాన వాటిక డోర్లు, సోలార్ స్తంభం

కొడిమ్యాల, ఏప్రిల్ 5 : బిల్లులు రాలేదని జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని గంగారాం తండా మాజీ సర్పంచ్ భూక్య బొజ్జనాయక్ గ్రామంలో నిర్మించిన శ్మశానవాటిక గది ఇనుప డోర్లు, కిటికీ డోర్లు తొలగించి ఇంటికి తీసుకెళ్లాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గ్రామంలో రూ.12.60 లక్షలతో శ్మశానవాటిక నిర్మించానని, ఏఈ చంద్రశేఖర్ రూ.4.50 లక్షలు మాత్రమే బిల్లు రికార్డు చేసినట్లు వివరించాడు. మిగతా రూ.8.10 లక్షల బిల్లు రావాల్సి ఉందని తెలిపాడు. పదవిలో ఉన్నప్పుడు త్వరగా నిర్మించాలని ఒత్తిడి తేవడంతో అప్పులు తెచ్చి నిర్మించానని, పదవి పూర్తయిన తర్వాత ఏఈని అడిగితే బిల్లు రికార్డు చేస్తలేరని చెప్పాడని వాపోయాడు. డోర్లు, కిటికీ డోర్లు, సోలార్ లైట్లకు సంబంధించిన ఇనుప స్తంభాన్ని తొలగించి తీసుకొచ్చినట్లు తెలిపాడు. ఈ విషయమై ఏఈ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా మాజీ సర్పంచ్ రూ.6 లక్షల వరకు పనులు పూర్తి చేయగా అవి రికార్డు చేసినట్లు చెప్పారు. మిగతా పనులు చేయకుండా రికార్డు చేయాలని చెప్పడంతో నిరాకరించినట్లు తెలిపారు.

# ఆలిండియా హాకీ పోలీస్ మీట్‌కు వినీత్



వినీత్

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 5 : ఈ నెల 7 నుంచి 14 వరకు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరగబోయే 73వ ఆలిండియా హాకీ పోలీస్ మీట్‌కు హుజూరాబాద్‌కు చెందిన మోటపోతుల వినీత్ ఎంపికయ్యారు. కాగా, వినీత్ హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో సిటీ పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. వినీత్ ఎంపికపై హుజూరాబాద్ హాకీ క్లబ్ శాశ్వత అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, జిల్లా హాకీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ బండ శ్రీనివాస్, హుజూరాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.